

సల్లంగ సూడమ్మా.. 8లో▸
మంచిర్యాల జిల్లా గాంధారి ఖిల్లా వద్ద గాంధారి మైసమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. మైసమ్మ తల్లిని దర్శించుకునేందుకు ఆదివాసీ నాయక్‌పోడ్‌లు వేలాదిగా తరలివచ్చారు.



ప్రశ్నార్థకంగా సాగు
అరుగాలం కష్టించి సాగు చేసిన యాసంగి పంటల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. వాతావరణం ప్రతికూలంగా మారడంతో చీడపీడల ప్రభావం ఎక్కువైంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.2 /22.2

వాతావరణం
ఆకాశం చాలావరకు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేకువజామున చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'దివ్యాంగుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి'

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని దివ్యాంగ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సట్టి సాయన్న ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్ రూ.4,016 నుంచి రూ.6,016 లకు పెంచాలన్నారు. మోటర్ రైజ్ వెహికల్స్ అందించాలని, ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.5 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని, దివ్యాంగుల కుటుంబాలకు ఉచిత విద్యుత్‌తో పాటు ప్రతీ జిల్లాలో దివ్యాంగుల రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

'గోండుగూడ వాసులకు పట్టాలివ్వాలి'



మాట్లాడుతున్న విలాస్

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోండుగూడ వాసుల పోడుభూములకు పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్ డిమాండ్ చేశారు. ఆదివారం గోండుగూడ వాసులతో కలిసి పోడు భూముల్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం పోడు సాగు కోసం చెట్లు నరికి కేసుల పాలయ్యారని, గత ప్రభుత్వంలో సర్వే నిర్వహించినా పట్టాలివ్వలేదన్నారు. ఈ భూములను రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు అప్పగిస్తున్న ప్రభుత్వం వీరికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు భుక్యా రమేశ్, గోండుగూడ వాసులు వెడ్మ నాగోరావు, తుకారాం, లక్ష్మణ్, అమృత్‌రావు, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



రిమ్‌జిమ్

నిర్మల్‌రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోయెట్రీ కాంపిటీషన్ (కవిత్వం)లో జిల్లా కేంద్రంలోని జేపీ ఎన్‌ఆర్ పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. పదోతరగతి చదువుతున్న రిమ్‌జిమ్ అనే విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థిని పోయెట్రీ వీడియోను ఆన్‌లైన్‌లో రాష్ట్రస్థాయికి పంపించగా ద్వితీయస్థానంలో నిలిచిందన్నారు. ఈ నెల 28న వరంగల్ రీజనల్ సైన్స్ సెంటర్లో బహుమతి అందుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'అధికవడ్డీ వ్యాపారం అరికట్టాలి'



మాట్లాడుతున్న దుర్గం నూతన్ కుమార్

ఖానాపూర్: పట్టణంతో పాటు గ్రామాల్లో విచ్చలవిడిగా జరుగుతున్న అధిక వడ్డీ వ్యాపారాన్ని అరికట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకూ వడ్డీ వ్యాపారుల బెడద ఎక్కువైందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన కొందరు ఇక్కడ మధ్యవర్తులను పెట్టుకుని ఈ దందా చేస్తున్నారన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఎంతోమంది నిరుపేదలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధిక వడ్డీ వసూలు దందాను నిర్మూలించాలని, లేనిపక్షంలో కార్మిక, గిరిజన, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నాగెల్లి నర్సయ్య, తొడసం శంభు పాల్గొన్నారు.

ఎడ్‌బిడ్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణవ్రతంలో పాల్గొన్న భక్తులు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్‌లో మల్లన్న జాతర కొనసాగుతోంది. ఆదివారం ఆలయ ప్రాంగణ మండపంలో భక్తులు సామూహిక సత్యనారాయణవ్రతంలో పాల్గొన్నారు. పిల్లాపాపలు, పాడి పంటలు మంచిగా ఉండాలని మొక్కుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావుపాటిల్ నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు.

దుకాణాల్లా.. దవాఖానాలు!

- గల్లీగల్లీకి ప్రైవేటు ఆస్పత్రులు
- ఏకంగా 'మల్టీస్పెషాలిటీ' బోర్డులు
- డాక్టర్ ఎవరో కూడా చెప్పరు..
- ఆర్‌ఎంపీల అండ ఉంటే చాలు..
- పేషెంట్లు వస్తే నిలువు దోపిడీ



నిర్మల్‌లోని చిన్నగల్లీలో మల్టీస్పెషాలిటీ పేరిట ఏర్పాటు చేస్తున్న ఆస్పత్రి

నిర్మల్: జిల్లాగా ఏర్పడినప్పటి నుంచి నిర్మల్ విస్తరిస్తోంది. అన్నిరంగాల్లో శరవేగంగా వృద్ధిచెందుతోంది. ఇదేక్రమంలో వైద్యసేవలూ విస్తరిస్తున్నాయి. ఒకప్పుడు హైదరాబాద్, నిజామాబాద్ వరకు వెళ్తే కానీ.. నయం కాని ఎన్నో ఆరోగ్య సమస్యలు, వైద్యపరీక్షలు నిర్మల్‌లోనే పూర్తవుతున్నాయి. ఇదంతా బాగానే ఉన్నా వైద్యసేవల ముసుగులో మోసాల కథలు పెరుగుతున్నాయి. దవాఖానాలంటే ఏదో దుకాణాలు పెట్టినట్లు పెట్టే సంస్కృతి పెరుగుతోంది. అసలు డాక్టరెవరో తెలియదు.. ఆ ఉన్న డాక్టర్ కూడా సంబంధిత వైద్యవిద్యను చదివాడా? లేదా? కూడా తెలియదు. కానీ వాళ్లు ఇచ్చే మందులు, వేసే బిల్లులు మాత్రం మాములుగా ఉండటం లేదు. 'ఇదేంటి సార్..' అంటే అంతే ఆ మాత్రం బిల్లులు కట్టకపోతే మా ఆస్పత్రులు ఎలా నడుస్తాయన్న ప్రశ్నలు వాళ్లే వేస్తున్నారు. ఇలాంటి కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, కొంతమంది ఫేక్ వైద్యుల కారణంగా అసలైన డాక్టర్లకు ఇబ్బందికరంగా మారుతుండటం గమనార్హం.

డాక్టర్ ఎవరంటే?

'అవే అక్క.. మొన్న బావకు బాగా పరేషానైందట కదనే.. ఏ దవాఖానాల చూపెట్టిండ్రే..'అంటే వెంటనే ఫలానా డాక్టర్ అని టక్కున సమాధానం చెబుతారు. సదరు ఆస్పత్రి పేరు తెలియకున్నా.. ఆ వైద్యున్ని మాత్రం బాగా గుర్తుపెట్టుకుంటారు. ఎందుకంటే ఆయన చేసిన వైద్యసేవ ఆ కుటుంబాన్ని నిలబెట్టింది కాబట్టి. కానీ.. ఇప్పుడు నిర్మల్‌లో కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏ డాక్టర్ ఉంటున్నారో.. అసలు ఎవరు డాక్టరో.. కూడా తెలియడం లేదంటే అతిశయోక్తి కాదు.

పేరు లేదు.. ఊరు లేదు..

జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుటగల ఓ స్కిన్ ఆస్పత్రిని పరిశీలిస్తే.. బోర్డుపై డాక్టర్ పేరు ఉండదు. కేవలం ఆస్పత్రి పేరు మాత్రమే ఉంటుంది. ఇక్కడ ఏ డాక్టర్ ఉన్నారు? ఎక్కడి నుంచి వచ్చారని అడిగితే.. 'మీకు స్కిన్ డాక్టరే కదా కావాల్సింది..' అన్న సమాధానం మాత్రమే ఇస్తారు. 'మా ఆస్పత్రిలో ఫలానా డాక్టర్ ఉన్నారు..' అని ప్రైవేటు ఆస్పత్రులు పెద్ద ఫ్లెక్సీలు పెట్టి మరీ ప్రచారం చేసుకుంటాయి. కానీ ఇలాంటి కొన్ని దవాఖానాలు మాత్రం కేవలం తమ ఆస్పత్రుల పేర్లు మాత్రమే పెడుతున్నాయి. కానీ అందులో ఏ డాక్టర్ ఉంటున్నారో మాత్రం పెట్టడం లేదు. అక్కడ వైద్యసేవలందిస్తున్నది అసలు సంబంధిత వైద్యవిద్యను చదివిన డాక్టర్లేనా..! అనేలా సందేహాస్పదంగా వ్యవహరిస్తున్నాయి.

ఆర్‌ఎంపీల అండ ఉంటే..

ప్రైవేటు ఆస్పత్రుల మధ్య పోటీ వాతావరణం పెరగడంతో ఆర్‌ఎంపీలకు పంట పండుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఏరోగమొచ్చినా.. నొప్పివచ్చినా.. ముందుగా ఆర్‌ఎంపీ వద్దకే ఉరుకుతున్నారు. వాళ్లు ఏది చెబితే.. అదే నమ్ముతున్నారు. ఈ నమ్మకాన్నే కొంతమంది ఆర్‌ఎంపీలు క్యాష్ చేసుకుంటున్నారు. పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులూ చాలావరకు ఆర్‌ఎంపీలనే నమ్ముకుంటున్నాయి. కేవలం వారి అండతోనే నడిచే పెద్దాస్పత్రులూ ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఈ కథంతా తెలుసుకుంటున్నవాళ్లు కొత్తగా దవాఖానా దుకాణాన్ని తెరుస్తున్నారు. తమకు ఆర్‌ఎంపీల అండ ఉంటే చాలంటూ ఎక్కడెక్కడి నుంచో వైద్యులను పట్టుకుని వచ్చి దందా లెక్క నడిపిస్తున్నారు. ఇంకో విచిత్రమేమిటంటే కొంతమంది ఆర్‌ఎంపీలే జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆస్పత్రులను పెట్టి నడిపిస్తున్నారు. వైద్యులు అందుబాటులో లేనప్పుడు వాళ్లే సదరు వైద్యుల్లా చలామణి అవుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.

గల్లీల్లో మల్టీస్పెషాలిటీలు..

ఇటీవల బస్టాండ్ పక్కన గల్లీలో 'మల్టీస్పెషాలిటీ హాస్పిటల్' అంటూ కొత్త దవాఖానా పెడుతున్నారు. ఆ వైపుగా వెళ్తున్న వారంతా ఈ గల్లీలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏంటన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆటోలు తిరగడానికే ఇబ్బందులు పడే ఆ ఇరుకుగల్లీలోకి అంబులెన్సులు ఎలా వస్తాయి? ఎప్పుడూ రద్దీగా ఉండే ఆ రోడ్డులో ఎలా వైద్యసేవలందిస్తారని ప్రశ్నిస్తున్నారు. మరో రెండు మూడు దవాఖానాలు ఇలాగే ఉన్నాయి. ఇంతకూ మల్టీస్పెషాలిటీ దవాఖానా అంటే ఏంటీ..? అందులో ఏఏరకాలైన వైద్యసేవలు అందించాలి? ఎన్ని గంటలపాటు వైద్యులు అందుబాటులో ఉండాలి? అసలు ఆస్పత్రి భవనం, సౌకర్యాలు, వసతులు ఎలా ఉండాలి..? ఇవన్నీ పట్టించుకోవడం లేదు. ప్రజారోగ్యాన్ని పట్టించుకోకుండా వైద్యాధికారులు సహకరిస్తే సరిపోతుందన్న ధోరణిలో కిరాణా దుకాణాల్లా దవాఖానాలు పెట్టేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం..



నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులను ఏర్పాటు చేయడానికి వీలులేదు. వైద్యసేవలు అందించే వైద్యుల వివరాలనూ వెల్లడించాల్సి ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ఆస్పత్రులు ఉన్నా వాటిపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ధన్‌రాజ్, డీఎంహెచ్‌వో

శాస్త్రీయ నృత్య పోటీల్లో చిన్నారుల ప్రతిభ



పురస్కారాలతో చిన్నారులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకు చెందిన పలువురు చిన్నారులు తమిళనాడులోని అరుణాచలంలో నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో గల స్వరూపిణి నృత్య కళాక్షేత్రానికి చెందిన దాదాపు 20 మంది బాలికలు వారి గురువైన నవ్య నేతృత్వంలో తమిళనాడులోని అరుణాచలం పట్టణంలో శివపాద మంజీర నాట్య మండలి ఆదివారం నిర్వహించిన నృత్య కళాప్రదర్శనలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. భారత్ ఆర్ట్స్' అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు లలితారావు చేతుల మీదుగా పురస్కారంతో పాటు నటరాజస్వామి ప్రతిమలను అందుకున్నారు. చిన్నారులను పలువురు అభినందిస్తున్నారు.

'ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి'



మాట్లాడుతున్న లక్ష్మణ్

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా డీఏ విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న యాదవ్, జె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రథమ కార్యవర్గ సమావేశాలు ఆదివారం హనుమకొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని కోరారు.

'అమృత్' బాసర

- రైల్వేస్టేషన్‌కు హైటెక్ హంగులు
- కేంద్రం నిధుల మంజూరు
- నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని నరేంద్ర మోదీ



బాసర రైల్వే స్టేషన్

భైంసా(ముధోల్): బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రంలో ఉన్న రైల్వేస్టేషన్‌కు హైటెక్ హంగులు దిద్దనున్నారు. జిల్లాలో మూడు కిలోమీటర్ల మేర ఉన్న రైల్వేలైన్‌లో భాగంగా బాసరలో స్టేషన్ ఉంది. రైల్వే స్టేషన్లను ఆధునికీకరించి అధునాతన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ స్కీం తీసుకొచ్చింది. ప్రపంచస్థాయి రైల్వేస్టేషన్‌లుగా తీర్చిదిద్దేందుకు బడ్జెట్‌లో రూ.5,071 కోట్లు మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా 40 స్టేషన్లను ఇప్పటికే ఆధునికీకరించారు. రెండోవిడతలో 500 రైల్వేస్టేషన్లకు నిధులు మంజూరు చేస్తున్నారు. ఇందులో భాగంగా 1500 రైల్వే ఫ్లైఓవర్‌లు, అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారు. తెలంగాణలో 15 రైల్వేస్టేషన్లు ఎంపిక చేశారు. వీటికి 230.24 కోట్లు విడుదల చేశారు. బాసరకు 11.33 కోట్లు కేటాయించారు. దీనికి సంబంధించిన పనులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

సరిహద్దు స్టేషన్‌గా...

చదువుల తల్లి నిలయమైన బాసరకు నిత్యం వేలాది మంది భక్తులు రైలు ప్రయాణం ద్వారానే వస్తుంటారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు స్టేషన్ కూడా బాసరనే. ఇక్కడే ట్రిపుల్‌ఐటీ ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 9వేల మంది విద్యార్థులు ఈ క్యాంపస్‌లో చదువుతున్నారు. ట్రిపుల్‌ఐటీ ఇతర విభాగాల్లో మరో 1000 మంది పనిచేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు రైలు ద్వారానే బాసరకు వస్తుంటారు. నిత్యం వేలాది మందితో రద్దీగా ఉండే బాసర స్టేషన్ పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోనుంది. మరోవైపు దక్షిణ మధ్య రైల్వేకు కేంద్రమైన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్ల నుంచి బాసర మీదుగా మహారాష్ట్రలోని నాందేడ్ వరకు రైల్వేలైన్ విద్యుదీకరణ పనులు జరుగుతున్నాయి. రైల్వే స్టేషన్ మీదుగా ఉత్తర, దక్షిణ భారతాల మధ్య నిత్యం 55 రైళ్లు తిరుగుతున్నాయి. రోజూ బాసర స్టేషన్లో కనీసం 2వేల మంది వరకు టికెట్లు తీసుకుని రాకపోకలు సాగిస్తుండగా పాస్‌ల ద్వారా వందలాది మంది ప్రయాణం సాగిస్తున్నారు.

చేపట్టనున్న పనులు..

అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా ప్రస్తుతం ఉన్న రైల్వే స్టేషన్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తారు. స్టేషన్లో వెయిటింగ్ హాల్, టాయిలెట్స్, ఎస్కలేటర్లు, లిఫ్టు ఏర్పాటు చేస్తారు. స్టేషన్ ముందు భాగాన్ని ఆధునికత ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు. రెండేళ్లలో పనులు పూర్తి చేస్తామని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.

ఏళ్లుగా నిరీక్షణ...

బాసర రైల్వేస్టేషన్ ఆధునికీకరణ కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. స్టేషన్‌లో ప్రస్తుతం విశ్రాంతి గదులు కూడా లేకపోవడంతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు రైల్వేస్టేషన్‌లో నిరీక్షించేందుకు ఇబ్బంది పడుతున్నారు. విడిది గదులు, హోటళ్ల నిర్మాణం జరుగలేదు. రోజు రోజుకూ యాత్రికుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా బాసర నుంచి సికింద్రాబాద్ వరకు ప్యాసింజర్ రైళ్లను నడపాలని కోరుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బాసర వరకు అమ్మవారి పేరిట రైలును ప్రారంభించాలని ఈ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు ప్రారంభం...

బాసర స్టేషన్‌లో సోమవారం జరగబోయే కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌తో పాటు జిల్లా ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు పాల్గొననున్నారు. ఎంపీ సోయం బాపూరావు కూడా పాల్గొననున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే రైల్వే అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా బాసర స్టేషన్ పూర్తిస్థాయిలో మారిపోనుందని తెలియడంతో ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు గ్యారెంటీలపై ఆశలు..!



భైంసాలో గృహజ్యోతి వివరాలు నమోదు చేసుకుంటున్న దరఖాస్తుదారులు (ఫైల్)

- ఉచిత విద్యుత్, రాయితీ సిలిండర్ అమలుకు సన్నాహాలు
- నిరుపేదలపై తప్పనున్న ఆర్థిక భారం
- రేషన్‌కార్డు ప్రామాణికంతో ఆందోళన

జిల్లా వివరాలు

తెల్ల రేషన్‌కార్డులు	2,08,463
గృహజ్యోతిలో నమోదైన కనెక్షన్లు	1,94,196


భైంసాటౌన్(ముధోల్): ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్, తెల్ల రేషన్ కార్డుదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఈ నెల 27న ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాలో ఉచిత విద్యుత్, రాయితీ సిలిండర్‌పై ప్రజల్లో ఆశలు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రజాపాలన కింద ప్రభుత్వం ఐదు గ్యారెంటీల అమలు కోసం వార్డుల వారీగా సభలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించింది. ఈ మేరకు దరఖాస్తుల ఆన్‌లైన్ సర్వే ప్రక్రియ సైతం పూర్తయింది. కాగా మహాలక్ష్మి పథకం కింద ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేశారు. ఇదే పథకం కింద త్వరలోనే రూ.500 లకు సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సైతం ప్రారంభించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో జిల్లావాసుల్లో ఆశలు నెలకొన్నాయి.

తగ్గనున్న భారం..

ప్రభుత్వం అమలు చేయనున్న ఉచిత విద్యుత్, రాయితీ సిలిండర్‌తో పేద కుటుంబాలపై ఆర్థికంగా భారం తప్పనుంది. ప్రస్తుతం వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.978.50, గతంలో రూ.1,150 ఉండేది. జిల్లాలో చాలామంది 60 నుంచి 90 రోజులకు ఒక సిలిండర్ వినియోగిస్తున్నారు. దీంతో దీంతో నెలకు రూ.300 నుంచి రూ.500 వరకు వంటగ్యాస్‌కే వెచ్చిస్తున్నారు. అలాగే విద్యుత్ బిల్లు దాదాపుగా చాలామంది పేద కుటుంబాలకు నెలకు రూ.120 నుంచి 300 వరకు వస్తోంది. ఈ లెక్కన మహాలక్ష్మి, గృహజ్యోతి పథకంతో పేద కుటుంబాలపై విద్యుత్‌కు జీరో బిల్లు కాగా వంటగ్యాస్ సిలిండర్‌కు రూ.500 మాత్రమే వెచ్చించాల్సి వస్తుంది. దీంతో తెల్ల రేషన్‌కార్డు కలిగిన అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థికంగా ఉపశమనం లభించనుంది. అయితే ఉచిత విద్యుత్ కోసం వినియోగదారులు గతంలో పెండింగ్ బిల్లును పూర్తిగా చెల్లించినవారికే అమలు చేస్తారా? లేదా మాఫీ చేస్తారా? అన్నది మార్గదర్శకాలు వెలువడిన తరువాత తేలనుంది.

రేషన్‌కార్డులు లేనివారిలో ఆందోళన...

గత ప్రభుత్వం 2019లో చివరిసారిగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసింది. ఆ తరువాత కొత్తగా కార్డులు మంజూరు చేయలేదు. దీంతో కొత్తగా పెళ్లయినవారు, పిల్లలు కలిగి వారి పేర్లు చేర్చుకునేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. కాగా ప్రభుత్వం మాత్రం కొత్త రేషన్‌కార్డులపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఆరు గ్యారెంటీల అమలుకు తెల్ల రేషన్ కార్డును ప్రామాణికం చేసిన నేపథ్యంలో కార్డులు లేనివారు పథకాలకు లబ్ధిపొందలేమని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు త్వరగా మంజూరు చేసి పథకాలకు అర్హులుగా గుర్తించాలని కోరుతున్నారు.



రథంతో గుడిచుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



జాతరకు హాజరైన భక్తులు

ముజ్గి మల్లన్న జాతర

నిర్మల్ మండలంలోని ముజ్గి గ్రామంలో మల్లన్న జాతర కొనసాగుతోంది. ఆదివారం భక్తులు ఆలయం చుట్టూ సంప్రదాయబద్ధంగా రథాన్ని ఊరేగించారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి బెల్లంతో తులాభారం వేసి మొక్కులు తీర్చుకున్నారు. టెంట్లు ఏర్పాటు చేసుకుని భక్తులు రాత్రి అక్కడే నిద్ర చేశారు. రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. - నిర్మల్‌రూరల్

తెరవే రాష్ట్ర మహాసభల్లో నిర్మల్‌గొంతుక



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కవులు

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, ప్రజాకవి గద్దర్, నల్లెల రాజయ్య ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రచయితల వేదిక 8వ రాష్ట్ర మహాసభల్లో జిల్లాకు చెందిన కవులు తమ గొంతుక వినిపించారు. తెలంగాణ రచయితల వేదిక(తెరవే)జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హన్మంతు, ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, గౌరవ సలహాదారులు డాక్టర్ అప్పాల చక్రధారి, తుమ్మల దేవరావు, బైరోజు వెంకటరమణాచారి, తిరునగరి భాస్కర్, పద్య కవయిత్రి సుమతి సాహితీ సందేశాలు వినిపించారు. 'తెలంగాణ తొలి, మలిదశల్లో ఉద్యమాల నేపథ్యం – తెలంగాణ పురోగమనం' అంశాలపై మాట్లాడారు. నూతనోత్సాహంతో సమాజాన్ని చైతన్యపరిచే సరికొత్త పంథాలో మరింత సాహిత్యం వెలుగులోకి రావాలని జిల్లా కవులు పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి రైల్వేగేటు సమీపంలో శనివారం రాత్రి రైలు ఢీకొన్న సంఘటనలో శేషపల్లి గ్రామానికి చెందిన కుర్మ కుమార్ (36) మృతిచెందాడు. మంచిర్యాల రైల్వేహెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ కథనం ప్రకారం.. గద్దెరాగిడి నుంచి కుర్మ కుమార్ కాలినడకన ఇంటికి వెళ్తున్నాడు. కొత్త బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తి అరెస్టు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల సమీపంలోని బ్రిడ్జి వద్ద ప్రమాదానికి కారణమైన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కత్తెరసాల సమీపంలో శనివారం బోలెరో వాహనం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో కంకణాల దేవేందర్‌రెడ్డి, ఎండీ సైఫ్ అలీ మృతి చెందాడు. బైక్ వెనకాల కూర్చున్న ఎండీ ఆబిద్‌కు తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతున్నాడు. మృతుడు దేవేందర్‌రెడ్డి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మద్యం తాగి బోలెరో వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన కోటపల్లి మండలం పారిపల్లి వాసి గడల తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి స్టేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్సెట్టిపేట మండలం గుల్లకోటకు చెందిన గుర్రాల శ్రీధర్‌రెడ్డి (45) బైక్‌పై మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో తన ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపు వస్తున్న ఆటోను బైక్ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీధర్‌రెడ్డి తలకు తీవ్రగాయాలు కాగా మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. హాజీపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహేశ్ తోపాటు ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా, ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: కుంటాల ఆరాధ్యదైవం శ్రీ గజ్జలమ్మ ముత్యాలమ్మ మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్, అప్పారావుపేట్, శివుని, మలక్‌జాం, హిమాయత్‌నగర్, ఇస్లాపూర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. చిన్నపిల్లలకు తులాభారం, తలానీలాలు అర్పించి మొక్కు చెల్లించుకున్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ గ్రామానికి చెందిన గాజుల గోదావరి.. అమ్మవారికి రెండు తులాల వెండిని బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించారు.

సల్లంగ సూడమ్మా..

- ముగిసిన గాంధారి మైసమ్మ జాతర
- వేలాదిగా తరలివచ్చిన ఆదివాసీలు



ఖిల్లాలోని దర్వాజ వద్ద బారులు తీరిన భక్తులు



కాలభైరవుడి విగ్రహం వద్ద మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లా వద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న గాంధారి మైసమ్మ జాతర ఆదివారం పెద్దపూజతో వైభవంగా ముగిసింది. మైసమ్మ తల్లిని దర్శించుకునేందుకు ఆదివాసీ నాయక్‌పోడ్‌లు వేలాదిగా తరలివచ్చారు. జాతరలో చివరిరోజైన ఆదివారం తెల్లవారుజాము గాంధారీ ఖిల్లా దిగువ భాగంలో ఉన్న జీడికోట నుంచి మైసమ్మతల్లి వద్దకు ఆదివాసీలు సంప్రదాయ తప్పెటగుళ్ల ఆటలతో, డప్పుచప్పుళ్లతో చేరుకున్నారు. అక్కడ గిరిజనులు తీసుకువచ్చిన గంగాజలంతో దేవతామూర్తులను శుద్ధిచేసి మైసమ్మతల్లి వద్ద పట్నాలు వేశారు. తర్వాత నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ జాతరలో పాల్గొనేందుకు జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి ఆదివాసీ నాయక్‌పోడ్‌లు, భక్తులు తరలివచ్చారు.

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే

గాంధారి ఖిల్లా ప్రాంతాన్ని టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. మూడు రోజుల జాతరలో ముగింపు ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఖిల్లాపైకి వచ్చి కాలభైరవుడి విగ్రహం వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతర నిర్వహణకు కలెక్టర్‌తో మాట్లాడి రూ.5 లక్షలు ఇప్పించానని అన్నారు. ఖిల్లాలో వెలిసిన మైసమ్మ తల్లి గొప్ప శక్తి స్వరూపిని అని, తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేకరాష్ట్రం రావాలని ఆనాడు అమ్మవారిని మొక్కుకున్నానని గుర్తుచేశారు. ఖిల్లా వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు అటవీశాఖ అనుమతులు అవసరమని ఇందుకు తాను కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలో ట్రైబల్ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని, గాంధారి ఖిల్లాలో భక్తుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన మంచినీటి ట్యాంకు నిర్మాణాన్ని చేపడుతామన్నారు. అనంతరం నాయక్‌పోడ్‌లు ఎమ్మెల్యేకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్, నాయక్‌పోడ్ సేవాసమితి నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిని అందిస్తున్న నాయకులు



మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



తల్లిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు

అధ్వానంగా సింగరేణి గార్డెన్



నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్

- నిర్వహణ అస్తవ్యస్తం
- పగిలిపోయిన టైల్స్
- పేరుకే ఏసీ హాల్
- పట్టించుకోని అధికారులు

శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్ నిర్వాహణ అధ్వానంగా మారింది. కార్మిక కుటుంబాలు వివాహాది, శుభాకార్యాలు చేసుకోవడానికి శ్రీరాంపూర్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఏకైక ఏసీ ఫంక్షన్ హాల్ ఇదొక్కటే ఉంది. ఐతే దీని నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో శుభకార్యాలు చేసుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో దీన్ని ఓల్డ్ కమ్యూనిటీహాల్ అనేవారు. మూడేళ్ల క్రితం ఇందులో ఏసీలు, టైల్స్ పెట్టి ఇతర హంగు ఆర్భాటాలతో ఆధునీకరించారు. ఇంత చేసిన నిర్వహణను గాలికి వదిలేశారు. హాల్‌లో ఉన్న ఏసీలు కొన్ని పనిచేయడం లేదు. పని చేస్తున్న ఏసీల రిమోట్‌లు మాత్రం జీఎం కార్యాలయంలోనే ఉంటాయి. వాటిని ఆన్‌చేస్తే ఒక్కో ఏసీ ఒక్కో టెంపరేచర్ మీద రన్ అవుతున్నాయి. రిమోట్లు అందుబాటులో లేకపోవడంతో చల్లదనం సరిపడా రావడం లేదు. స్టేజీపై ఉన్న కొన్నిటైల్స్ పగిలిపోయాయి. దీంతో వేదిక్పై వచ్చి వెళ్లేవారికి కాళ్లకు గాయాలవుతున్నాయి. దీనికితోడు కొన్ని లైట్లు పనిచేయడం లేదు.



పాకురుతో ఉన్న మంచినీటి ట్యాంక్

మురికి పట్టిన డైనింగ్ హాల్..

డైనింగ్ హాల్ అయితే మరింత అధ్వానంగా ఉంది. ఫ్లోర్ సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో మురికిపట్టి నల్లగా మారి దుర్గంధం వెదజల్లుతుంది. కిచెన్ ఏరియాలో వంట సామగ్రి, ప్లేట్లు కడుక్కోవడానికి ఉన్న మంచినీటి ట్యాంకు అపరిశుభ్రంగా ఉంది. అందులో చెత్తాచెదారం, పాకురు, ప్లాస్టిక్‌పైపులు అధ్వానంగా మారింది. ప్లేట్లు శుభ్రం చేసుకోవడానికి నీటిని తోడితే అందులో పురుగులు వస్తున్నాయని వంట మనుషులు పేర్కొంటున్నారు. డైనింగ్ సెక్షన్ షెడ్డు ఎత్తు తక్కువగా ఉండటంతో వేసవిలో వేడి, తీవ్ర ఉక్కపోతతో శుభకార్యాలకు హాజరైనవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన దీని నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టి సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా

- నేడు యూబీఐతో సింగరేణి యాజమాన్యం ఒప్పందం

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగి ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో కాని, బయట గాని మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) అంగీకరించిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో యూబీఐతో ఒప్పందం చేసుకోనున్నట్లు పేర్కొన్నారు. మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి చెల్లించాల్సిందేనని పలు దఫాలుగా చేపట్టిన ఆందోళనల ఫలితంగా యూబీఐ అంగీకరించిందని తెలిపారు. ఉద్యోగి ప్రతిఏటా రూ.274 అదనంగా చెల్లిస్తే మరో రూ.30 లక్షలు చెల్లించడానికి అంగీకరించారని సీతారామయ్య వివరించారు. సింగరేణి ఉద్యోగులు వివిధ బ్యాంకుల్లో ఖాతాదారులుగా ఉన్నారని తెలిపారు. యూబీఐ మాదిరిగా మిగతా బ్యాంకులు రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని లేకపోతే యూబీఐకి వేతనాలు బదిలీ చేసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

ఏఐటీయూసీ కృషితోనే..

కాసిపేట: ఏఐటీయూసీ కృషి ఫలితంగా సింగరేణి కార్మికులు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు యూబీఐ అంగీకరించిందని బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య బ్యాంకు అధికారులతో చర్చలు జరిగాయని పేర్కొన్నారు. ఇతర బ్యాంకులు సైతం ఇదే విధంగా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

ముగిసిన సెపక్‌తక్రా పోటీలు

నల్లగొండ: నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో జూనియర్, సబ్ జూనియర్ అంతర్ జిల్లా సెపక్‌తక్రా చాంపియన్ షిప్‌పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చారని అన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ప్రేమ్‌రాజ్, సురేష్ పాల్గొన్నారు.

జూనియర్ బాలుర విభాగంలో రంగారెడ్డి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ జట్టు ద్వితీయ స్థానం, హైదరాబాద్–నిజామాబాద్ జట్లు సంయుక్తంగా తృతీయ స్థానంలో నిలిచింది. రంగారెడ్డి జట్టుకు 3 బంగారు పతకాలు, నిజామాబాద్‌కు ఒక బంగారు పతకం, ఒక రజతం, ఒక కాంస్యం లభించింది. నల్లగొండ జట్టు ఒక రజతం, ఒక కాంస్యం సాధించింది. ఆదిలాబాద్ ఒక రజతం, ఒక కాంస్యంతో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించింది. హైదరాబాద్, వరంగల్ జట్లు చెరో రెండు కాంస్య పతకాలను సాధించగా, మహబూబ్‌నగర్ ఒక రజత పతకాన్ని కైవసం చేసుకుంది.



పతకాలతో ఆదిలాబాద్ బాలుర జట్టు క్రీడాకారులు



విజేతలతో బాలుర క్రీడాకారులు

కళ్లకు గంతలతో బైక్‌లపై అయోధ్యకు

కైలాస్‌నగర్: హైదరాబాద్‌కు చెందిన మెజీషియన్లు మారుతిజోషి, రామకృష్ణ కళ్లకు గంతలు కట్టుకొని అయోధ్యకు బైక్‌లపై యాత్ర చేస్తున్నారు. ఆదివారం ఈ యాత్ర జిల్లా కేంద్రానికి చేరుకోగా వారిని ఎంపీ సోయం బాపూరావు సన్మానించారు. స్థానిక శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో జరిగిన కార్యక్రమంలో మఠాధిపతి యోగానంద సరస్వతితో కలిసి పూలమాల, శాలువలతో సత్కరించారు. యాత్రకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సురక్షితంగా అయోధ్యకు చేరుకుని బాలరాముని దర్శించుకోవాలని ఆకాంక్షించారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూసిన అయోధ్య భవ్య రామమందిర నిర్మాణ కలను ప్రధాని మోదీ సాకారం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు స్వాములు తదితరులు పాల్గొన్నారు.



యాత్రికులను సన్మానిస్తున్న ఎంపీ సోయం

రక్తకణాలు తగ్గి మహిళ మృతి

లక్ష్మణచాంద: రక్తకణాలు తగ్గి మహిళ మృతి చెందింది. మండలంలోని చామన్‌పెల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొమ్మోజి లక్ష్మి(42)కి శనివారం జ్వరం వచ్చింది. కుటుంబ సభ్యులు ఆమెను నిర్మల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు చేయగా రక్తకణాలు తగ్గాయని ప్లేట్‌లెట్స్ ఎక్కించాలని తెలిపారు. రాత్రి ఆమెకు ప్లేట్‌లెట్స్ ఎక్కించినా పెరగకపోవడంతో ఆరోగ్యం మరింత క్షీణించింది. కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో అంబులెన్స్‌లో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త శంకర్, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అదృశ్యమైన యువతి.. బావిలో శవమై..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

పెంచికల్‌పేట్: గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన గుండెపల్లి గ్రామానికి చెందిన యువతి తలండి నిర్మల(26) వ్యవసాయ బావిలో ఆదివారం శవమై తేలింది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గుండెపల్లికి చెందిన నారాయణ–వెంకుబాయి దంపతుల కుమార్తె నిర్మల బెజ్జూర్ మండలంలోని కోయపెల్లికి చెందిన రవికుమార్ గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. శుక్రవారం ఇంటి నుంచి నిర్మల అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ బావి సమీపంలో రక్తపు మరకలు, చెప్పులు చూసిన కుటుంబీకులు గ్రామస్తుల సహాయంతో బావిలో వెతకగా మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్యలు మృతదేహాన్ని పరిశీలించారు. ప్రేమించిన యువకుడే నిర్మలను హత్య చేసి బావిలో పడేసినట్లు మృతురాలి తండ్రి ఆరోపించారు. అతని ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్):మండలంలోని గుడిపేట వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం..గుడిపేటకు చెందిన దొరిశెట్టి రాజయ్య తన బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి తిరిగి ఇంటి వస్తున్నాడు. లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొంది. రాజయ్యకు తీవ్ర గాయాలు కాగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవే ట్ ఆస్పత్రికి పంపించారు. రాజయ్యకు వరుస సోదరుడు సూర్యప్రకాశ్ ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి గాయాలు

నిర్మల్: సారంగాపూర్ మండలం అడెల్లి గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మాలోజీ గ్రామానికి చెందిన రేయిండ్ల సాయినాథ్(40) బైక్‌పై అడెల్లిలోని తన బంధువుల శుభకార్యానికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో అడెల్లి చేరుకోగానే గుర్తుతెలియని ఆటో బైక్‌ను ఢీకొట్టింది. సాయినాథ్ కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన జిల్లా క్రీడాకారులు

నేరడిగొండ: జూనియర్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు గోల్డ్‌మెడల్ సాధించారు. బిహార్ రాష్ట్రం పట్నాలో ఈనెల 21 నుంచి 25 వరకు 41వ జూనియర్ జాతీ యస్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్ 23–24 బాల,బాలికలు పాల్గొన్నారు. ఫైనల్‌లో తెలంగాణ, కేరళ జట్లు తలపడ్డాయి. కేరళ జట్టుపై ఒక రన్ తేడాతో విజయం సాధించారు. ఆదిలాబాద్ జిల్లా బాలుర నుంచి అఖిల్, బాలికల నుంచి డి.శిరీష, ఎం.అలేఖ్య, బి.వనిత నేరడిగొండ క్రీడాకారులు పాల్గొని బంగారు పతకాలు సాధించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తోపాటు, ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్, జిల్లా ఎన్ఐఎస్ కోచ్ ఓ.అఖిల, అసోసియేషన్ సభ్యులు, జిల్లా పేట అధ్యక్ష, కార్యదర్శులు వారిని అభినందించారు.

రెండోరోజూ టీసీసీ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష రెండోరోజు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాకేంద్రంలో జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రంలో డ్రాయింగ్ లోయర్, హైయర్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం పరీక్షకు 513 మందికి గాను 367 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 513 మందికి గాను 366 మంది హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఏసీజీఈ దామోదర్‌రావు పరిశీలించారు.

గోదావరి తీరంలో స్వచ్ఛభారత్

భైంసా: బాసర గోదావరి నదితీరంలో సంత్ నిరాకారి నిజామాబాద్ శాఖ సంయోజక్ లక్ష్మణ్ నేతృత్వంలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. సభ్యులంతా గోదావరి నది పరీ వాహక ప్రాంతాల్లో, స్నానఘట్టాల వద్ద చెత్తను తొలగించారు. దశరథ మహరాజ్ ఆశ్రమ పరిసర ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. 100 మంది సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుక్కలదాడిలో చిన్నారులకు గాయాలు

తానూరు:మండలంలోని తొండాల గ్రామంలో ఆదివారం వీధి కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలయ్యాయి. చిన్నారులు ఆడుకుంటుండగా ఆదిత్య, సాయినాథ్, విలాస్‌పై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చింది. కుటుంబీకులు వారిని ధర్మాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో బుద్ద ప్రకాశ్‌కు చెందిన ఇల్లు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బుద్ద ప్రకాశ్ ఉపాధి నిమిత్తం దక్షిణాఫ్రికాలో మెల్ట్ కంపెనీలో అకౌంటెట్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. గతనెల క్రితం సమీప బంధువుల వివాహం నిమిత్తం గ్రామానికి వచ్చాడు. శనివారం పాలోది గ్రామంలో జాతరకు వెళ్లి వచ్చాడు. రాత్రి ఇంట్లో కుటుంబీకులు, అతను నిద్రకు ఉపక్రమించారు. రాత్రి ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన కుటుంబీకులు, గ్రామస్తులు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వస్తువులు టీవీ, బీరువాతోపాటు తదితర ఫర్నిచర్ వస్తువులు, రూ.1.22 లక్షల నగదు, సర్టిఫికెట్స్, పాస్‌పోర్ట్ కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. తాంసి ఎస్సై శివరాం ఆదివారం ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. తమను ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కలెక్టర్‌ను వేడుకుంటున్నారు.



కాలిపోయిన ఇంటిని చూపుతున్న ప్రకాశ్

కొనసాగుతున్న ‘కడెం’ మరమ్మతులు



గేజ్ రూం సమీపంలో డ్రిల్లింగ్ పనులు



గుంత పూడ్చుతున్న పొక్లెయిన్

కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. భారీ వరదలకు దెబ్బతిన్న స్పిల్‌వే కింది ప్రాంతాన్ని సిమెంట్ కాంక్రీట్‌తో ఎడమ కాలువ వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని మొరంతో పూడ్చారు. నూతన ప్రాజెక్ట్ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై గతంలో ఢిల్లీ బృందం సూచించిన ప్రాంతాల్లో డ్రిల్లింగ్ పనులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వంలో విడుదలైన రూ.కోటి నిధులతో మరమ్మతు పనులు కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

నేడు సమీక్షా సమావేశం

కడెం ప్రాజెక్ట్ మరమ్మతులపై ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, మెకానికల్ టీం, ప్రాజెక్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో ప్రాజెక్ట్ స్థితిగతులపై పూర్తి రిపోర్ట్‌ను అందించనున్నట్లు డీఈ బోజదాసు తెలిపారు.

వైర్లనూ వదలడం లేదు..!

భైంసాటౌన్: పట్టణంలో చిల్లర చోరీలు ఎక్కువవుతున్నాయి. ఇటీవల గుజిరిగల్లి, బ్రాహ్మణగల్లిలో ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్రవాహనాల టైర్లను ఎత్తుకెళ్లారు. తాజాగా పంటచేలల్లో బోరు మోటార్ల వైర్లు సైతం చోరీకి గురయ్యాయి. పట్టణంలోని పార్డి(బి) బైపాస్ రోడ్డులోని పంట చేలల్లో నుంచి రాత్రివేళల్లో వైర్లు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు పేర్కొంటున్నారు. ఇలా దాదాపు పది నుంచి పదిహే ను బోర్ల మోటారు వైర్లు చోరీకి గురైనట్లు తెలిపారు. గతంలో సైతం ఇలాంటి ఘటనలు జరిగినట్లు రైతులు చెబుతున్నారు.



భూమిలోపలి నుంచి బోరుకు ఉన్న వైరును ఎత్తుకెళ్లిన దృశ్యం